# అతను, అతనిలాంటి మరొకడు



83
డా॥ వి. చంద్రశేఖరరావు



అతన్ని, అంతగా పట్టించుకోం, మనం.

అరుదైన ఎరుపు రెక్కల పక్షిలా క్యాంపస్‌లో తరుచుగా కనపడే మనిషి. ముందు ఎవరో అన్నట్టు చూస్తాం. కాస్త దూరం వెళ్ళినాక ఇతనా అంటూ వెనక్కు తిరిగి చూస్తాం. వందలుగా వెలిసిన విద్యార్థి (సమూహాల) సమాఖ్యల ఆఫీసుల ముందర, కర పత్రాల్ని పంచుతూ కనిపిస్తాడు మనలో ఒకళ్ళం, అతని చేతిలో యాభయ్యో, వందో పెడితే అతను చాలా అవమానాన్ని పొందినట్లుగా ముఖం పెట్టి, ఏదో గొణుక్కుంటూ వెళ్ళి పోతాడు.

గుంపులు గుంపులుగా ఆర్ట్స్ కాలేజి ఎదుట బస్‌స్టాప్ దగ్గర మూగి, రహస్య ఉద్యమాన్నేదో రచిస్తున్నట్లు ఫోజుపెట్టి, ఆ రాత్రికి, క్వార్టర్ మందు బాటిల్‌కి డబ్బులెవరిస్తారా అని బెగ్, బారో ప్రాతిపదిక మీద వంద సంపాదించి బాటిల్ దొరగ్గానే, మౌనంగా ఒకరి తరువాత ఒకరు బౌద్ధ సన్యాసుల్లా, నడుచుకుంటూ వెళ్ళి, హాస్టల్ ముందు, క్యాంప్ ఫైర్ పెట్టి, విరిగిన కుర్చీలు, బల్లలు అందులో విసిరి ఇవే పోస్ట్ మోడరన్ వెలుగులు అంటూ ఆనందిస్తూ రమ్ము బాటిల్ కార్కు తీసి, మనలోని సగంమంది ఇంకా రోడ్డు మీదే నిలబడి, రోడ్డుపైన వెళ్ళే ఖరీదైన కార్లను ఆపి "రీసెర్చిస్కాలర్లం, హాస్టళ్ళ నుంచి గెంటి వేశారు. ఆకలి, హెల్ప్ ప్లీజ్" అంటూ కార్డుబోర్డు అట్టపై రాసిన ప్రకటనలను వాళ్ళకు చూపి,

ఆ సమయంలో అతను కనిపిస్తాడు.

టెన్నిస్ కోర్టు అవతల, కొండరాళ్ళ మధ్యన తిరుగుతూ, రాళ్ళ గుట్టల మధ్య చెరిగిపోయిన నినాదాల కోసం వెతుకుతుంటాడు. అక్క డంతా చెత్త పేరుకొని ఉంటుంది. ఖాళీ బీరుబాటిళ్ళు, తెగిన హైహీల్ చెప్పు, అట్టముక్కలు, పాత పేపర్లు, నిషేధ సాహిత్యం. రోడ్డు

పైన ఎక్కడో పోలీసు పెట్రోలింగ్ వాన్ వెళుతున్న చప్పుడు. అతనికి సైగ చేసి, అక్కడ నుంచి వెళ్ళమని మనం రోడ్డుకి అరకిలో మీటరు దూరంలో ఉండి అరుస్తూనే ఉంటాం. అతను పెద్దగా పట్టించుకోడు. ఎప్పటి రొటీన్‌లాగే, లైబ్రరీ వైపు, అటునుంచి, లాబరేటరీల వైపు, అట్లా క్యాంపసంతా తిరుగుతూనే ఉంటాడు. స్టూడెంట్ సమాఖ్య(ల) ఆఫీసులు, స్విమ్మింగ్ పూల్ దాటి, అక్కడ గోడలపై పెద్ద పెద్ద అక్షరాలతో రాసిన తెరాసవాళ్లవి, ఎబివిపివాళ్ళవి నినాదాల్ని పెద్ద పెద్దగా చదువుతూ, మధ్యమధ్యలో గాఢంగా నిట్టూరుస్తూ, మెల్లగా రోడ్డు దాటి, కొత్తగా పెట్టిన ఫెమినిస్ట్ అధ్యయన కేంద్రంవైపు వెళ్తాడు.

నిన్న సాయంకాలం స్విమ్మింగ్ పూల్ దగ్గర ప్రత్యక్షం అయ్యాడు. వేసవి సాయంకాలాలు, స్విమ్మింగ్‌పూల్ ప్రేమికుల విడిదిలాంటిది. నగ్నంగా కాదుగానీ, సెమీ న్యూడ్ అనదగ్గ దృశ్యాలు అక్కడ కనిపిస్తాయి. వస్తూనే స్విమ్మింగ్ పూల్ గట్టుపైన కూలబడ్డాడు. శ్రీశ్రీదో, స్విన్‌బర్న్‌దో పోయమొకటి చదవటం మొదలుపెట్టాడు. బొత్తిగా అతని గురించి తెలియని ఇంజనీరింగ్ అమ్మాయిలిద్దరు, అతని పక్కనే కూర్చుని, "ఝలక్ దిక్ లాజా" అంటూ హిందీ పాప్ సాంగ్ పాడుతూ, అతని మెడ చుట్టూ చేతులేసి, గట్టిగా ముద్దు పెట్టుకొని; వెనక నుంచి కేకలు పెడుతున్నారు మిగిలిన కుర్ర వాళ్ళు, "అతన్ని వదిలేయండి. అతను ఒకప్పటి మన నేత, మన ఆదర్శం, మన స్వప్నం. మీరు టీజ్ చెయ్యాల్సిన మనిషి కాదు" అని. ఈ లోపలే అతను వాళ్ళిద్దరికీ హ్యూమన్ సెక్సువాలిటీ మీద, ఫ్రాయిడన్ సిద్ధాంతాలు, వాటిపై మార్క్సు ప్రతిపాదనలు వివరించటం మొదలుపెట్టాడు.

ఉదయం పదయింది. క్యాంపస్ అంతా కళకళలాడుతుంది. ఆర్ట్స్ కాలేజి దగ్గర, గేటు ముందర నిలబడి, ఒక్కొక్కళ్ళనే పలకరిస్తూ, "హాయ్ బాస్, హలో కామ్రేడ్, ఆదాబర్సే" చూస్తుండగానే అతని





చుట్టూ ఒక పదిమంది మూగుతారు. గట్టిగా ఆలింగనం చేసుకొని, ఎన్నాళ్ళకెన్నాళ్ళకు అంటూ కళ్ళలో నీటిపొర తిరుగుతుండగా "అన్నా, ఓ పాట అందుకోవే" అంటారు. అతని ముఖంలో వెలుగు. క్షణాల్లో, మహా మేఘగర్జనలా మారిపోతాడు. దూరంగా చెట్లచాటున, బల్లల పైన, తుపాకులు గడ్డం కింద పెట్టుకొని, దిక్కులు చూస్తున్న రిజర్వు పోలీసులు కొద్దిగా కంగారుపడి పైకి లేస్తారు. అతను హఠాత్తుగా పాట ఆపేస్తాడు. పగిలిన తలలు, రక్తం మరకల శరీరాలతో క్యాంపస్‌లో విహ్వలంగా పరిగెత్తిన ఏ క్షణాలో గుర్తుకొస్తాయి. మూటలు కట్టి పడవేసినట్లుగా, రోడ్డుపైన గుట్టలు గుట్టలుగా పడి ఉన్న విద్యార్థులు, వాళ్ళ శరీరాలపై విరుగుతున్న లాఠీలు గుర్తుకొస్తాయి. అతనికి దుఃఖం వేస్తుంది. పాట ఆపి, అక్కడే నేలపై కూలబడి పెద్దపెట్టున ఏడవటం మొదలుపెడ్తాడు. అతనిలోని ఉద్వేగాల మార్పును చూసి మనం చలించిపోతాము. భయమో, గౌరవమో, మరే భావమో, మౌనంగా అక్కడినుంచి వెళ్తాము.

రేపు ఉదయం మైక్రోసాఫ్ట్ తాలుకు (ఇండియా) ప్రతినిధికి సన్మానం అంటూ వి.సి. అందరికీ నోటీసులు పంపాడు. క్యాంపస్‌ని కాస్త శుభ్రంగా, కళగా ఉంచమని అభ్యర్థించాడు. (క్యాంపస్ ప్లేస్ మెంటు కోసం ఆయన తంటాలు) లారీల నిండా పూలకుండీలు వచ్చాయి. కొద్దిమంది KTSలు (కీన్‌టైప్ స్టూడెంట్లు) రాత్రంతా మేలు కొని బ్యానర్లు కడుతూనే ఉన్నారు. ఆడిటోరియంకు వెళ్ళే రోడ్డునంతా శుభ్రంచేసి, చెత్తను హాస్టల్ వెనక పోశారు.

రాత్రి పన్నెండు తరువాత అతను ప్రత్యక్షమయ్యాడు. (పెట్రో లింగ్ వాన్‌ల గురించి మన భయం). వందలాది నిరసన నినాదాలు రోడ్డు పొడవునా రాయటం మొదలుపెట్టాడు. మూడు గంటల వేకువ జామున హాస్టల్‌లో ఒక తలుపు తట్టాడు. "టీ ఏమయినా దొరుకు తుందా?" అన్నాడు. అయితే ఆ ఒక్క రూమ్‌లోనే కాదు, చాలా

రూముల్లో అతను ప్రత్యక్షం అయ్యాడు. ఒక రూమ్‌లో మైదా ఉడక బెట్టుకొన్నాడు. ఇంకో రూమ్‌లో తెల్లకాగితాలు (నినాదాలు రాయ డానికి) అడిగి తీసుకొన్నాడు. అతను ఒకడు కాదేమోనని మన గట్టి అనుమానం. నిజానికి మనం, మన ప్రియమైన అధ్యాపకులు అందరం, అతను ఎన్నో యేళ్ళ క్రితమే క్యాంపస్ నుంచి అదృశ్యం అయ్యాడనే అనుకుంటున్నాము. అయితే, ఇలా హఠాత్తుగా ప్రత్యక్ష మవుతాడు, పదేపదే అవతరించే పురాణాలలోని మనిషిలా. రూమ్ నెం. 38లో పెద్దగా మంటలు రేగాయి. మీటింగ్ కోసం తెచ్చిన బ్యానర్లు, పోస్టర్లు, తోరణాలు, పూలదండలు, అన్నీ మంటల్లో భగభగమనటం మనం చూశాము. అతనే కారణమని మనలో చాలా మందికి తెలుసు. ఎన్ని ఫైర్ ఎగ్డింగ్ విషర్స్ వాడినా ఆ మంటలు ఆరలేదు.

కొందరు ప్రత్యేకమైన కేటగిరీ విద్యార్థుల్ని అతను నిత్యం తరుముతూ ఉంటాడు. క్యాంపస్ మధ్యలో ఆపి సిగిరెట్ అడుగు తాడు. ఆ కుర్రవాళ్ళు ముందు తెల్లముఖం వేస్తారు. మోకాలు దగ్గర చిరిగిన జీన్‌పాంట్, ఐ లవ్ అమెరికా అన్న అక్షరాలున్న టీ షర్ట్, పొడవాటి జుట్టు, ఇదొక ప్రత్యేకమైన బ్యాచ్. యూనివర్సిటీ వీళ్ళకొక ఆటస్థలం. కాలక్షేపం చెయ్యడానికి, గర్ల్‌ఫ్రెండ్స్, పబ్, యాంకీ భాష. TOFEL, GRE పరీక్షలు. వీళ్ళు అతన్ని చూసి వణికిపోతారు. సిగిరెట్ ప్యాకెట్ ఇస్తారు. చాలా వినయంగా అతని ముందు నిలబడతారు. సిగిరెట్ తాగుతూ అతనో గంభీరమైన ఉపన్యాసం ఇస్తాడు. దూరం నుంచి చూస్తే ఆరుబయట క్లాస్‌రూమ్‌లా తోస్తుంది. సుమారు గంట సేపు ఉపన్యాసం ఇచ్చి, రేపు ఈ చెవులకున్న రింగ్‌లు, చేతులకున్న బ్యాండ్‌లు తీసేసి రమ్మని ఆదేశిస్తాడు. క్యూబా మీద ఒక పుస్తకాన్ని ఇచ్చి, రాత్రికి చదువుకు రండి, రేపు మనందరం కూర్చుని దీన్ని గురించి చర్చించుకుందాం అంటాడు. ఇది స్వేచ్ఛపై అణిచివేత.





సాంస్కృతిక దాడి అని ఆ పిల్లలు లోలోపల గొణుక్కుంటారు. రాత్రికి రాత్రి వాళ్ళ వాళ్ళ విద్యార్థి సంఘాలకు ఫిర్యాదు చేస్తారు. దళిత విద్యార్థి సంఘాలు, బహుజన, విద్యార్థి సమాఖ్యలు ఈ ఫిర్యాదును సీరియస్‌గా పట్టించుకోవు. అయితే స్టూడెంట్సు ఫర్ జస్టిస్ వాళ్ళు అఖిలభారత ధార్మిక సమాఖ్యవాళ్ళు, ఈ విషయం పై పెద్ద పెట్టున గొడవ చేస్తారు. హాస్టళ్ళన్నీ తిరిగి కుర్రవాళ్ళను సమీకరిస్తారు. క్లాసుల్ని బాయ్‌కాట్ చేయిస్తారు. ఆర్ట్స్ కాలేజి దగ్గర నిలబడి మిగిలిన పిల్లల్ని అటకాయిస్తారు. విషయం వి.సి. దాకా వెళుతుంది. వి.సి. ఆశ్చర్యం నటిస్తాడు. అతనెక్కడున్నాడు ఇప్పుడు. అతన్ని, అతని వారసుల్ని, తిరుగుబాటుదారులని తీర్మానించి (నిషేధించి) క్యాంపస్ నుంచి తరిమి వేశాము కదా ఇదంతా ఒట్టి భ్రమ. అతనిప్పుడొక కాల్పానిక విషయం అంటూ విసుక్కుంటాడు.

అయితే అ.భా.ధా.స వాళ్ళు, నిరసనను కొనసాగిస్తారు. వేరే విషయాలను చర్చకు తెస్తారు. రాత్రిపూట లేడీస్ హాస్టల్ నుంచి బయటకు వెళుతున్న అమ్మాయిల గురించి గొడవ చేస్తారు. పబ్‌లకు వెళుతూ, ఎవడో ఒకడి కారులో రాత్రి ఏ మూడు, నాలుగు వరకూ షికార్లు చేసిరావడం. ఇది మన సంస్కృతేనా? దీన్ని నివారించడానికి మీరేం చర్యలు తీసుకుంటున్నారని గొడవ చేస్తారు. అక్కడే ఉన్న ఫెమినిస్ట్ ఫోరమ్ వాళ్ళు రంగప్రవేశం చేస్తారు. స్త్రీల లైంగికత (సెక్సువాలిటీ) మీద ఘోరమైన దాడిగా దీన్ని వర్ణిస్తారు. ఫోరమ్ తరపున ఆ అమ్మాయిలకు కౌన్సిలింగ్ యిస్తున్నామని, అసలు, ప్రతి ఆడ-మగ స్నేహం సెక్స్‌కే దారి తీస్తుందనే తీర్మానం అనాగరికమైనదని గొడవ చేస్తారు. అయితే అ.భా.ధా.స అంతటితో ఊరుకోక ఒక ఫెమినిస్టు ఫోరమ్ అమ్మాయికి 'అతని'తో చనువు, దగ్గరితనం ఉన్నాయని, వాళ్ళిద్దరు ఇంటిమేట్‌గా ఉన్న దృశ్యాలు క్యాంపస్‌లో చాలాసార్లు చూశామని ఫిర్యాదు చేస్తారు. ఆ అమ్మాయి కన్నీళ్ళ

పర్యంతం అయ్యింది. అతనంటే, అతని తీర్మానాలు, ప్రతిపాదన లంటే తనకు సమ్మతం కాదని, కన్నీళ్ళ మధ్యన చెబుతుంది. మళ్ళీ అతని గురించి చర్చా అని వి.సి విసుక్కుంటాడు. ఇదంతా గాలితో యుద్ధం అని చర్చలకు తలుపులు మూసివేస్తాడు. ఈ లోపల వి.సి. రూములో మూగిన రకరకాల విద్యార్థి సమాఖ్యలు కొత్త సమస్యలని బయటకు తీస్తాయి. ముస్లిం మైనారిటీలపై మీ వైఖరి ఏమిటని ఇస్లామిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ వాళ్ళు అడుగుతారు. తలపై 'చాదర్' వేసుకున్న తమ అమ్మాయిల్ని అ.భా.ధా.స వాళ్ళు టీజ్ చేస్తున్నారని, దానిపై ఏమి చర్య ఉండదా అని అడుగుతారు. దళిత సమాఖ్య నుంచి కొత్తగా చీలిన ఉపదళిత సమాఖ్య మాకూ ఒక ఆఫీసు రూము, ప్రత్యేకమైన గుర్తింపు కావాలని, డిమాండ్ చేస్తారు. సరిగ్గా ఆ సమయంలో, ఎక్కడ నుంచో అతని గొంతు వినబడు తుంది. "కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు, తాతగారి, నాన్నగారి భావాలకు దాసులు," అంటూ శ్రీశ్రీ పాటను ఎలుగెత్తి పాడు తుంటాడు. అందరూ ఉలిక్కిపడతారు. వి.సి. మాత్రం ఏమీ వినబడని వాడిలా నటిస్తాడు.

సెప్టెంబరు మాసం మనందరం పదేపదే గుర్తుకు తెచ్చు కుంటాం. ముందుగా యాభైయేళ్ళ పైనే వయసున్న మహా వృక్షాలన్నీ, ఎవరో శాపం పెట్టినట్లుగా పెళపెళమంటూ నేల కూలాయి, కొద్దిపాటి గాలి వానకే.

ఆ చెట్లపై నివాసమున్న వందలాది పక్షుల శవాలు, పొదల చాటున, రోడ్ల పక్కన అదొక భయానకమైన దృశ్యం. హాస్టల్‌కు చేరే నీళ్ళ పంపుల్లో సీవేజ్ వాటర్ కలిసి, హాస్టళ్ళంతటా డయేరియాలు, విషజ్వరాలు వ్యాపించింది కూడా ఆ నెలలోనే. సరిగా మీసాలైనా రాని ఇద్దరు ముస్లిం కుర్రవాళ్ళను (MA ప్రీవియస్) ముంబై బాంబ్ పేలుళ్ళతో సంబంధముందంటూ పోలీసులు అరెస్టు చేశారు.





క్యాంపస్ అంతా చలనం లేని బొమ్మల్లా ఉండిపోయారు. వాళ్ళ తరపున ఏ ఒక్కమాట మాట్లాడినా, ఏం తంటా వస్తుందోనని మనం భయంతో బిగుసుకుపోయాము. ఎన్నడూ లేనిది యూనివర్సిటీ రోడ్డుపై యాక్సిడెంట్ జరిగింది. ఇద్దరు ఫిలాసఫీ రీసెర్చి స్కాలర్లు, (మోటారు సైకిల్‌పై వెళుతూ) లారీని ఢీకొని అక్కడికక్కడే చచ్చి పోయారు.

సెప్టెంబరు మాసం చివరి శనివారం ఉదయం పదిగంటల వేళ అతను ప్రత్యక్షం అయ్యాడు. అందరూ క్లాసులకు వెళ్ళే హడావుడి లో ఉండగా ఎప్పటి మాదిరిగానే తన శైలిలో ఉపన్యాసం మొదలు పెట్టాడు.

"తల్లుల్లాంటి చెట్లు, చిన్నచిన్న పిట్టలు, సిద్దిఖి, అజమ్‌లు, మాధ్యూ, రమేష్ వీళ్ళ కోసం మనం దిగులుపడనవసరం లేదా? మరణానికి కూడా మనం స్పందించటం మానివేశామా?" అన్నాడు. ఎవరికీ అర్థం కాలేదు. "నిరసన తెలియజెయ్యటంరాదు. ప్రశ్నించటం రాదు? కనీసం దిగులుపడటం కూడా రాదా?" అని గద్దించాడు. "ఈ మరణాలన్నిటికీ మన దుఃఖాన్ని తెలియజేస్తూ ఒక గంటసేపు మౌనం పాటిద్దాం" అంటూ గంభీరంగా ఆజ్ఞాపించాడు.

ఆశ్చర్యం! సినిమాల్లో ఫ్రీజ్ చెయ్యబడ్డ షాట్‌లా మొత్తం క్యాంపస్ అంతా మహా నిశ్శబ్దంగా మారిపోయింది. ఆ దృశ్యం ఒక చరిత్ర. అతనే, అతనికి మాత్రమే సాధ్యం, ఇది సాధించడానికి అని మన మనందరం అనుకున్నాం కూడా.

డిసెంబరు నెలలో మనం మరో అద్భుతాన్ని చూశాం. ప్రొఫెసరు కాలయ్య ఒక బోధివృక్షం కింద నలుగురు విద్యార్థులు చుట్టూ మూగి ఉండగా, దళితులు హిందువులు ఎట్లా కారో, సాక్ష్యా లతో సహా వివరిస్తున్న సమయంలో, మనం క్షణంపాటు ఉలిక్కి పడ్డాం. అతనిలాంటి మరొకడు క్యాంపస్‌లో ప్రత్యక్షమయ్యాడు.

కొద్దిగా వయస్సు ఎక్కువే ఉంటుంది. కానీ అచ్చంగా అతనే. ముఖ్యం గా ఆ కళ్ళు, జ్వలించే సూర్యగోళాల్లాంటి కళ్ళు. గుబురు గడ్డం. నిత్యం ఆలోచనలతో నిండిన ముఖం- సరిగ్గా అతనే కానీ అతను మరొకడు.

క్యాంపస్‌లో ఇతని ప్రవేశం చాలా ఉద్వేగభరితంగా జరిగింది.

"అప్పుడు నేనిక్కడే ఉన్నాను. అప్పుడు క్యాంపస్ అగ్నిగోళంలా రగిలే రోజులు. మామూలు క్యాంపస్ కాదు. 'J' చంపబడ్డప్పుడు పక్కనే నేనున్నాను. విద్యార్థులందరూ ఆయన కోసం రోదించటం నేను చూశాను. ఆ స్థలంలో పూలగుత్తులు, తెల్లకాగితాలపై రాసిన 'J' అమర్ హై నినాదాలు, అక్కడే కూర్చుని రాత్రంతా మేలుకొని, కాండిల్స్ వెలుతుర్లో వందలాది కవితల్ని (ఎలిజీల్ని) చదివిన క్షణాల్లో నేనున్నాను.

ఇవాళ మళ్ళీ క్యాంపస్‌లో అడుగు పెడుతున్నప్పుడు మొట్ట మొదటిసారి ఆ ప్రదేశానికే వెళ్ళాను. తోటలో కెల్లా అత్యంత ఎరుపు గలిగిన గులాబిరెమ్మను ఆ ప్రదేశంలో ఉంచాను. ఆ ప్రదేశంలో అతని పేరుతో పాటు నా పేరు కూడా నిక్షిప్తం అయ్యి ఉంటుంది."

అందరం ఖంగుతిన్నాం అతని ఫ్లాష్‌బాక్‌కి. అతని మాటల్ని నమ్మకుండా ఉండలేకపోయాం. మాంత్రికుడు, జోలెలోంచి ఒక్కో అద్భుతాన్ని బయటకు తీసినట్లు, అతను రోజుకో రూపంలో మన ముందు ఆవిష్క రించబడ్డాడు. ముందుగా హ్యూమన్ రైట్స్ అన్నాడు. ఆడిటోరియంలో గొప్ప సెమినార్ జరిగింది. వందలాదిగా మేధావులు వచ్చారు. మనందరం లేగదూడల్లా మూగి, అతనిచుట్టూ తిరుగుతూ అన్ని పనులు మనమే చేశాము.

మన అధ్యాపక వర్గం కొద్దిగా భయపడ్డారు. మళ్ళీ మన నాలుకల పై పోరాటాల భాషను రాస్తాడేమోనని. అయితే అలాంటి ఎజెండా అతనికి లేదని త్వరలోనే తేలిపోయింది.

అయితే మనందరిలో ఒకటే సందేహం.





అతనిలాగే ఇతను ఎందుకు ఉన్నాడని. ప్రొఫెసర్ కాలయ్య గారు, సామాజిక తిరస్కృతుల ముఖాలన్నీ ఒక్కలాగే ఉంటాయని సూత్రీకరించారు.

అతడు క్యాంపస్‌కు కొత్తభాష నేర్పాడు. థియేటర్ గ్రూపు, స్ట్రీట్ ప్లే, మైమ్‌లాంటి కొత్త వ్యక్తీకరణల్ని నేర్పాడు. ఫస్టియర్ కుర్ర వాళ్ళంతా అతని చుట్టూ మోళీ కట్టినట్లు. క్యాంపస్ అతని చుట్టూ తిరుగుతుంది. చాలాయేళ్ళ తరువాత హాస్టలు బయట అందరూ కలిసి పాడుకునే (మందు పాటలు కాదు) సంస్కృతి వచ్చింది.

ఇతను కూడా పోరాటాల గురించి మాట్లాడటం మొదలు పెట్టాడు. దళిత, బహుజన పోరాటాలకు శక్తినివ్వాలంటూ మాట్లాడే వాడు. ఇతని, ఆ మాసిన గడ్డం, అతి సాదాసీదా డ్రస్సు (అచ్చం అతనిలాగే), క్యాంపస్‌లో నడిచివెళుతుంటే అందరం గౌరవసూచకం గా తలలు వంచి పక్కకు తిరిగి తోవ ఇచ్చేవాళ్ళం. లైబ్రరీ పక్కన అతని కార్యాలయం ప్రారంభమైంది. దళిత, బహుజన హక్కులకోసం ఒక పత్రిక మొదలైంది. స్త్రీపై హింసను (సాంఘిక, కుటుంబ) ఎదిరించడానికి ఒక 'సహాయ' సంస్థ నిరుద్యోగ యువకుల కోసం 'సు స్పందన' అనే మైక్రోఫైనాన్స్ సంస్థ మొదలైనాయి. క్యాంపస్‌లో మళ్ళీ కొత్త విప్లవం వచ్చింది. చాలా మంది రీసెర్చి స్కాలర్లు పార్ట్‌టైమ్ యాక్టివిస్టులుగా చేరారు. ఎటుచూసినా కొత్త స్వేచ్ఛ. ఎసైన్‌మెంట్లు, డేటా కలెక్షన్, కొత్త ఆశల లోకం యిది. గమ్యం అవసరంలేదు. ఓడిపోతామనే భయంలేదు. మూడో ప్రపంచ దేశాల విప్లవం వచ్చేసింది. లాటిన్ అమెరికా, లావోస్, లెబనాన్, అన్ని దేశాల పోరాటాల నమూనాలు కట్ అండ్ పేస్ట్‌లుగా మన ముంగిట్లో ప్రత్యక్షం అవుతాయి.

మనం ఇప్పుడు మినర్వారాణి గురించి చెప్పుకుందాం. నగర ప్రపంచానికి కొత్తగా పరిచయమైన బాలిక. దళితవాడల హింస తెలిసిన బాలిక. కొత్త విముక్తి కోసం కలలు కంటున్న అమ్మాయి.

ఇతని ప్రపంచం చూసి విస్తుపోయింది. దాన్నిండా అందమైన మనుషులు. సృజనాత్మకత గురించే మాట్లాడేవాళ్ళు. ప్రతి సమస్యకు అతని దగ్గర పరిష్కారాలున్నాయని నమ్మింది. క్యాంపస్‌లో ముందు పుకారుగా, తరువాత నిజంగా మారిన వార్త ఇతనితో మినర్వారాణి సాన్నిహిత్యం. దాదాపుగా అతని నీడలా మారిపోయింది. దళిత స్త్రీల పోరాటాల కార్యనిర్వహణ పూర్తిగా మినర్వారాణికి యిచ్చేశాడు ఇతను.

ఆమెతో అనేవాడు దళితత్వం ఎంత సౌందర్యమైన విషయం, దళిత స్త్రీలు సౌందర్యానికి నిర్వచనాలని.

శీతాకాలపు చలిగాలుల్ని మాత్రమే తెలిసిన ఆమెకు ఇతని సాన్నిధ్యంలో కొత్త సూర్యోదయాలు కనిపించాయి. బంధనాల్ని తెంచి వేసే కొత్త ప్రతీక ఇతను, ఆమెకు.

జనవరి మొదటివారంలో వరల్డ్ ఫోరం సభలు జరిగాయి హైదరాబాదులో. ఆర్గనైజర్లలో ముఖ్యుడు ఇతను.

ఇతని తాలుకు ప్రతి ఉత్తరానికి మినర్వారాణి సమాధానం ఇచ్చేది. ఈ-మెయిల్, ఫోనోగ్రాములు, జీతంలేని స్టెనోగ్రాఫరైంది.

మనదో కుటుంబం అనేవాడు. మనకో మంత్రగీతం కావాలి అనేవాడు. విధ్వంసం చెయ్యడానికి, పునర్నిర్మించుకోవడానికి అవసర మైన మంత్రం. వరల్డ్ ఫోరం లాంటివి అట్లాంటి మంత్రం అనే చెప్పే వాడు.

వారం రోజుల సభలు. యూనివర్సిటీ అంతటా కోలాహలం. వందలాదిగా విద్యార్థులు హాజరయ్యారు. ఆ సభలో మినర్వారాణి దేవతా మూర్తిలా వెలిగిపోయింది.

జనవరి చివరిరోజుల్లో, అతనిలాగే ఇతను కూడా అదృశ్యం అయ్యాడు. Gone! పగిలిన బీరుసీసాలు, సునామీ బాధితులకోసం





సేకరించి పంపిణీ చెయ్యలేకపోయిన పాతబట్టల గుట్టలు మాత్రం మిగిల్చి, క్యాంపస్ నుంచి ఇతను కూడా అదృశ్యం అయ్యాడు.

మినర్వారాణి ఇప్పుడు దుఃఖపు పాట. ఆమె కోసం చివరి కబురు కూడా మిగల్చలేదు. పదిరోజుల తరువాత ఆమె పేరుతో పదివేల డాలర్ల చెక్కు వచ్చింది. ఒక సాయంకాలం మనందరికి తన కవితలు వినిపించే సమయంలో మినర్వారాణి ఆ చెక్కును ముక్కలు ముక్కలుగా చించి, గాలిలో ఎగర వేయటం మనందరం చూశాము.

మినర్వారాణితోసహా మనం అతనిలాంటి మరొకడు కాకుండా 'అతను' మళ్ళీ కనిపిస్తే బాగుండు అని అనుకుంటూనే ఉన్నాం.

*ఆదివారం వార్త, 30 జులై 2006*